# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

మార్చి / March - 2022

ॐ

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / **Vol. 98** మార్చి/**March - 2022** సంచిక/**No.3**

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – శ్రీ శివమహిమ్న స్తోత్రం | 2 |
| 2. | ధ్యానము – శంభు నటనము | 2 |
| 3. | పరమ పూజ్యశ్రీ ఓంకార్ ఆత్మకథ–అనువాదం:శ్రీమతి బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | భగవత్ కృప – శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ | 8 |
| 5. | ఇతర మార్గమేమియు లేదు – స్వామి ఓంకార్ | 9 |
| 6. | శ్రీ తులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి | 11 |
| 7. | తత్వమసి – శ్రీ తెన్నేటి విశ్వనాథం | 13 |
| 8. | భీష్మ స్తవరాజము – శ్రీ మహాభారతము | 16 |
| 9. | శ్రీ యమధర్మరాజు ప్రోక్త శివకేశవ స్తుతి – మల్లాది శ్రీహరిశాస్త్రి | 18 |
| 10. | కమలాకర చరిత్రము – ఆదిపాండురంగ భక్త విజయము | 20 |
| 11. | సాధువు గారి కౌపీనము – శ్రీ రామకృష్ణ పరమహంస | 23 |
| 12. | FORM-IV - (SEE RULE-8) | 25 |
| 13. | కార్యక్రమములు, విరాళములు | 26–28 |

*** ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–**

# ప్రార్థన

## శ్రీ శివమహిమ్న స్తోత్రం

**ప్రార్థన అనేది దేవునివైపు చేసే ప్రయాణం**

**శ్లో॥ తవైశ్వర్యం యత్నా ద్యదుపరి విరించి ర్హరిరథః**
**పరిచ్ఛేత్తుం యాతా వనల మనల స్కంద వపుషః ।**
**తతో భక్తి శ్రద్ధాభరగురు గృణద్భ్యాం గిరిశ యత్**
**స్వయం తస్థేతాభ్యాం తవ కిమనువృత్తి ర్నఫలతి ॥ 10**

**తాత్పర్యం**

కైలాసాధిపతీ! జ్యోతిస్తంభంగా ప్రత్యక్షమైన నీ మహిమని కొలవడం కోసం బ్రహ్మదేవుడు పైకీ, విష్ణువు క్రిందికీ వెళ్ళి విఫలులైనారు. అప్పుడు భక్తిశ్రద్ధలతో నిన్ను పరిపూర్ణంగా నిన్ను స్తోత్రం చేయగా నీవు స్వయంగా ప్రత్యక్షమైనావు. నీ సేవ వృథా అవుతుందా?

# ధ్యానము

## శంభునటనము

**ప్రాతఃకాలము ధ్యానానికి మంచి సమయము**

అనంగపరిపంథినమజం క్షితిధురంధరమలం కరుణయంతమఖిలం
జ్వలన్తమనలం దధతమంతకరిపుం సతతమింద్రసురవందితపదం
ఉదంచదరవిందకులబంధుశతబింబరుచిసంహతిసగంధవపుషం
పతంజలినుతం ప్రణవపంజరశుకం పరచిదంబరనటం హృది భజ.

**తాత్పర్యం :**

ఆయన మన్మథుని శత్రువు. అతడికి పుట్టుకలేదు. లయం చేయడంలో సమర్థుడు. అయినా అందరి మీదా ఎంతో దయ. మండేజ్వాలని చేత్తో పట్టుకుంటాడు. యమునికి విరోధి. ఇంద్రాది దేవతలు ఆయనని నిత్యమూ పొగుడుతూ ఉంటారు. ఆయన శరీరం నూరు సూర్యబింబాల కాంతితో ధగధగలాడుతూ సువాసనలు వెదజల్లుతూ ఉంటుంది. పతంజలి చేత కీర్తింపబడేది ఇతడే. ఓంకారమనే పంజరంలోని చిలుక ఇతడే. పరచిదంబరేశ్వర నట ప్రభువుని హృదయంలో ధ్యానించు!

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అధ్యాయం - 36**

**మూలం : స్వామి ఓంకార్ అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి**

## నీవు వేళ్ళేదారిలో గులాబీలను పరుచుకుపో

### భారతదేశానికి తిరిగి రావటం

సోదరి సుశీలాదేవిని పరిచయం చేయడానికి సమయం వచ్చింది. ఈ ఆత్మకథను చదువుతున్నవారందరికీ సుశీలాదేవి గురించి తెలియాలి. ఆమె శాంతి ఆశ్రమంలో ప్రధాన భూమిక పోషించినది. దాదాపు ఇరవైఐదు సంవత్సరాలుగా ఆశ్రమానికి సేవలందించింది. ఆమె అసలు పేదు కుమారి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్డు. నేను మూడవ పర్యాయం అమెరికా దేశము వెళ్ళినప్పుడామె న్యూయార్క్, ఫిలడెల్ఫియా నగరాల మధ్యనున్న న్యూజెర్సి నగరంలో నివసిస్తుండేది. ముందుగా ఆమెకు మా శాంతికేంద్రాలు ఎలాంటి ఆర్భాటమూ లేకుండా చేస్తున్న శాంతియుత కార్యక్రమాల గురించి ఏ మాత్రము తెలియదు. తెలిసిన తర్వాత క్రమం తప్పకుండా ఎంతో దూరంనుండి ఎలాంటి అసౌకర్యము భావించకుండా పాల్గొనేది. నా మొట్టమొదటి శాంతి సందేశాన్ని మొదటి సమావేశంలో ఆమె విన్న తర్వాత వ్యక్తిగత హృదయ శాంతి ప్రపంచశాంతికి బాటలు వేస్తుందని గ్రహించి, దాని పట్ల ఆమె ఎంతగానో ఆకర్షితురాలయి శాంతి సందేశాలను ప్రచారం చేయడానికి తన యావత్తు జీవితాన్ని శాంతి ఆశ్రమ సేవలకే అంకితం చేసింది.

ఆ రోజుల్లో నా సమావేశాలకు హాజరయిన ఎంతో మంది సహృదయులు, భక్తిశ్రద్ధలు గల వారు ఎంతో అంకితభావంతో తమ జీవితాలను శాంతికేంద్రాల కార్యక్రమాలకే అంకితం చేస్తామని ప్రమాణాలు చేసేవారు. వారంతా నాతో పాటు భారతదేశానికి వచ్చి భారతీయ సోదర సోదరీమణులకు, అలాగే పాశ్చాత్య దేశాల్లో శాంతి ప్రచారానికి సేవ చేస్తామని చెప్పేవారు. చివరికి సుశీలాదేవి ఒక్కరే తల్లిదండ్రులను, సోదరుడిని, సోదరిని, బంధుమిత్రులను, తన సర్వస్వాన్ని త్యాగం చేసి అందరినీ వదలిపెట్టి భారతదేశానికి వచ్చి సేవలందించింది. వారి కుటుంబము సెవెంత్ డే ఎడ్వంటిస్టు క్రైస్తవులు. వారి మతంలో వారికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఎంతో క్రమశిక్షణ, సేవానిరతి, త్యాగబుద్ధి కలవారు. కుమారి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్డు (సుశీలాదేవి) కులమతానికి, దేశకాలాలకి అతీతురాలు. ఆమె హృదయం విశ్వప్రేమకు నిలయం. అందరిని ప్రేమించేది.

మేరీ మాత అడుగుజాడల్లో నడిచిన సాధుశీలి క్లార మాదిరిగా ఆమె పేరుతో కూడా చాలా అర్థవంతమయిన భావమున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ఆమెను మొదటిసారి చూచినప్పుడే ఆమె సద్గుణాలకు తగిన పేరు సుశీలాదేవిగా నిశ్చయించుకున్నాను. ఆ పేరు అంటే నాకు చాలా చాలా ఇష్టం. ప్రేమ, శాంతి,

దయ, పవిత్రత మూర్తీభవించిన లక్షణాలు ఆమెలో నిండుగా ఉన్నాయి. ఆమె జీవితం సేవకి అంకితం చేసింది. ఒక పవిత్రమయిన రోజు కుమారి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్డుకు అందరి భక్తుల సమక్షంలో 'సుశీలాదేవి' అని నామకరణం చేయబడింది. ఆమెపై పరమాత్మ అనుగ్రహం అమృతవర్షంలా కురవాలని, తద్వారా ఆమె భక్తిమయ జీవితంలో ప్రేమ, ఆధ్యాత్మిక క్రాంతి నిండిపోవాలని ప్రార్థిస్తున్నాను.

నిజానికి నేను మీతో చెప్పినట్లుగా చాలా మంది భక్తులు నాతో పాటు భారతదేశానికి రావాలని, శాంతి ఆశ్రమంలో సేవలందించాలని అనుకున్నారు. కానీ సమయం వచ్చినప్పుడు మాత్రం ఒకరి తర్వాత ఒకరు ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకున్నారు. తర్వాత తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమానికి వీలుచూసుకొని తప్పకుండా వస్తామని చెప్పారు. ఇంకొక ఇద్దరు పవిత్రాత్మ స్వరూపిణులయిన మహిళలు మాతో రావటానికి సిద్ధపడ్డారు. వారిలో ఒకరు కుమారి ఓలిఫాంట్, ఆమె చాలా పొడవుగా ఉండే పెద్దావిడ ఆమె చాలా కాలము టీచరుగా పనిచేసింది. రిటైర్ అయిన తర్వాత ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ, అలవాటు ప్రకారం అందరిపై పెత్తనం చెలాయిస్తూ ఏదో ఒకటి చెపుతూ ఉండేది. ఆమె ముందుగా ఆమెరికాలోని రామకృష్ణ మిషన్ సంస్థతో అనుబంధం కల్గి ఉండేది. తర్వాత శాంతి కేంద్రాలు ప్రచారం చేస్తున్న శాంతి సందేశాల పట్ల ఆకర్షితురాలయి ఈ మార్గంలోనికి వచ్చింది. ఆమె తన మిగిలిన జీవితాన్ని భారతదేశ సేవలో గడపాలని నిర్ణయించుకుంది.

కుమారి ఓలిఫాంట్‌కి, సుశీలాదేవికి అన్ని విషయాల్లో చాలా భేదముంది. సుశీలాదేవి వినయశీలి, తన్ను తాను ఒక విద్యార్థిలాగా ఓలిఫాంటాకి ఒదిగి ఉండేది. మాకు భారతదేశానికి సరాసరి రావడానికి టికెట్లు దొరకనందువలన జపాను వెళ్ళి అక్కడి నుండి భారతదేశానికి రావాలనుకున్నాము. కుమారి ఓలిఫాంటా కూడా మాతో పాటు జపానుకు వచ్చింది. ఇంకొక పెద్దావిడ కూడా నా వద్ద ధ్యాన తరగతులకు వస్తుండేది. ఆవిడ కూడా జపాను వచ్చింది. ఆమె కూడా తన జీవితాన్ని భగవంతుని బిడ్డలకి సేవ చేసేందుకు అంకితం చేయాలనుకుంది. దురదృష్టవశాత్తూ ఆవిడ జపాను దేశంలో జబ్బు పడింది. అందువలన ఆవిడా, కుమారి ఓలిఫాంటా ఇద్దరూ కల్సి అమెరికా తిరిగి వెళ్ళిపోయారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో మేము 'డాలర్ లైన్' అనే చాలా పెద్ద పేరున్న స్టీమరు ఎక్కాము. ఆ స్టీమరులో ప్రశాంతత అన్నది మచ్చుకయినా లేదు. నేను ఎప్పుడూ నిశ్శబ్దంగా, ప్రార్థనలో కాలం గడిపేవాడిని కావడం వలన అందులో ప్రయాణం నాకు గాని, సుశీలాదేవికా గాని అంతగా నచ్చలేదు. ఏదో విధంగా ఆ వాతావరణానికి నెమ్మదిగా అలవాటు పడి, అందులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులతో నెమ్మదిగా స్నేహం చేసి వారిలో చాలా మందిని శాంతి ఆశ్రమానికి సన్నిహితులుగా మార్చాము. అందులో కొంత మంది భారతదేశానికి వచ్చి శాంతి ఆశ్రమంలో కొంతకాలము ప్రశాంతమయిన జీవితం గడపాలనే కోరిక వ్యక్తం చేశారు.

జపాను దేశాన్ని 'చ్రిపూల దేశము' అని పిలుస్తుంటారు. అక్కడి చెట్లన్ని విరగపూసి చూడడానికి చాలా ఆహ్లాదకరంగా, స్ఫూర్తిదాయకంగా ఉండి సంతోషాన్ని కలుగ చేస్తున్నాయి. జపాను నుండి భారతదేశానికి వెళ్ళడానికి మేము దాదాపు నెల రోజులు పాటు ఆ దేశంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. నాకప్పుడు మేము ఏ నగరంలో విడిది చేశామో గుర్తు లేదు. కాని అది మంచి అందమయిన, ఆరోగ్యకరమయిన విశ్రాంతి భవన సముదాయము. అందులో ఎందరో విదేశీయులు బస చేశారు. మంచి సౌకర్యవంతమయిన పెద్ద గదిలో మేమున్నాము. జపానులో ఉన్నంతకాలము సోదరి సుశీలాదేవి మా విడిది కోసం చాలా డబ్బు ఖర్చు చేసింది.

మాకు అక్కడ చేయడానికి పని ఏమీ లేకపోవడం వలన సుశీలాదేవి ఒక కారు మాట్లాడి జపానులోని దూర దూర ప్రాంతాలకి చూడడానికి తీసుకువెళుతుండేది. జపానులో మేము ఎలాంటి పెద్ద సమావేశాలు నిర్వహించలేదు కాని కొద్దిమందిని పోగు చేసి వారికి శాంతి సందేశాలను వినిపించి, వారితో ప్రార్థన, ధ్యానము మొదలైనవి చేయించేవాళ్ళము. వాళ్ళ హృదయాలను భక్తితో, శాంతితో నింపే ప్రయత్నం చేసేవారము.

నాకు ఇప్పటికి కూడా ఆ సంఘటన బాగా గుర్తుంది. నాకు కాఫీ త్రాగే అలవాటు లేదు. సుశీలదేవి పదే పదే కోరటం వలన నేను మొదటిసారి కాఫీ త్రాగాను. కానీ త్రాగడం నాకు పడకపోవడం వలన వెంటనే వాంతి చేసుకున్నాను. సుశీలదేవి చాలా బాధపడింది. నన్ను జపానులోని దూరప్రాంతానికి కొండలు, పొలాలు ఉన్న ప్రదేశాలకి తీసుకువెళ్ళింది. జపానులోని స్త్రీలు, పురుషులు, చిన్నపిల్లలు కూడా పొల్లాలో కష్టపడి పనిచేయడం చూసి నేను చాలా ఆనందించాను. జపానులోని ప్రధానమయిన ఆహారం వరి. అందువలన ఆ దేశాన్ని 'వరి దేశము' అని కూడా అంటారు. కొండల్లో అందమైన ప్రకృతి సౌందర్యంతో ఉన్న దారుల్లో చాలా దూరం ప్రయాణం చేయటం వలన నా మనస్సుకు ఉల్లాసంగా అనిపించింది. క్షేమంగా మా గదికి చేరుకున్నాము.

హెటల్‌కి చేరుకున్న తర్వాత నా గదికి వెళ్ళాను. వెళ్ళేటప్పుడు నేను నా గదికి తాళం వేశాను. కానీ ఆశ్చర్యకరంగా నా గది తాళం తీయగానే లోపల ఒక వ్యక్తి కనిపించాడు. గదంతా చిందరవందరగా ఉంది. ముఖ్యంగా నా పెట్టె తెరిచి పుస్తకాలు, పేపర్లు, నా ఉత్తరాలను పరిశీలిస్తున్నప్పుడు నేను అతడిని తాళం వేసిన నా గదిలోకి ఎందుకు ప్రవేశించావని, నా వస్తువులను ఎందుకు వెదుకుతున్నావని ప్రశ్నించగా అతడు పొరపాటుగా అది తన గది అనుకొని లోపలికి వచ్చానని చెప్పాడు. అతను పట్టుబడిపోయిన దొంగలాగా కంగారుగా నా గది నుండి తొందరగా బయటికి వెళ్ళిపోయాడు. నేను హెూటల్ యజమానితో జరిగినదంతా వివరించి, ఇలాంటి కుత్సితమయిన పనులు చేయటం వలన జపాను దేశీయులు మంచివారు కారు అని భావిస్తారని చెప్పాను. దానికి ఆ హెూటలు యజమాని నవ్వుతూ అతను సి.ఐ.డి. ఏజెంట్ అయి ఉంటాడని ఏమయినా ఆధారాలు దొరుకుతాయి అని వెదకడానికి

వచ్చి ఉంటాడని, మేము విప్లవకారులతో సంబంధాలు లేనివారయితే ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పాడు. అయినా జరిగిన దానికి తాను చాలా విచారిస్తున్నానని, దాని గురించి కనుక్కుంటానని, ఇకపై అలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని వాగ్దానం చేశాడు.

భగవంతుని అనుగ్రహం వలన మిగిలిన రోజులన్నీ చాలా సంతోషంగా గడిచిపోయాయి. మేము చాలా విశ్రాంతిగా ఉండటం వలన నిరంతరం ప్రార్థనల్లో, ధ్యానములో కాలము గడిపాము. దాని వలన భవిష్యత్తులో మా వలన జరగనున్న బృహత్తరమైన కార్యక్రమాలు నిర్వహించడానికి కావలసిన శక్తిని సమకూర్చుకున్నాము. జపానులోని చర్రీపూల అందాలను చూస్తూ మేము అలసట అనేది తెలియకుండా కాలం గడిపాము. సుశీలదేవి అందమైన చర్రీపూల మీద, అక్కడి ఆహ్లాదకరమైన ప్రకృతి సౌందర్యం పట్ల తన ఆలోచనలను కాగితంపై కవితలా పెట్టింది. దైవం ఆశీర్వదించిన వారి హృదయాలు కేవలం దైవాన్ని మాత్రమే కాకుండా ప్రకృతిలోని ప్రతి చెట్టు, పుట్ట, పిట్ట, మొక్కలు, పూలు, క్రిమికీటకాలను కూడా ఒకే విధంగా ప్రేమిస్తారు. అప్పుడు జీవితం ఎంతో ఆనందమయంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. సాధు హృదయాలు శాంతిమయంగా ఉంటాయి.

ప్రకృతితో అనుబంధం ఏర్పర్చుకొని అనుసంధానం అవటం భగవదనుగ్రహమే. అలాంటివారు కేవలం మానవుడిలోనే కాకుండా ప్రకృతిలోని జీవరాసులన్నింటిలో భగవంతుని దర్శించగల్గుతారు. పక్షులు, మొక్కలు, పూలు అన్నీ భగవంతుని స్వరూపం గానే గోచరిస్తాయి. సాధుమహాత్ముల హృదయం సంతోషంతో, శాంతితో నిండిపోతుంది. సాధువు, ఫ్రాన్సిస్ వంటి మహాత్ముడు నిరంతరము సృష్టి అంతటా భగవంతుని దర్శించేవాడు. ఆయన చుట్టూ జంతువులు కూడా ఎలాంటి భయం లేకుండా కూర్చునేవి. ఎంత అదృష్టమిది అందరిని ప్రేమించగల్గటం, అలాగే అందరి చేత ప్రేమించబడటము రెండూ గొప్ప విషయాలే. మేము జపాను దేశంలో గడిపిన ఆనందమయ జీవనం ఇంకా నా హృదయంలో మధురంగా, సజీవంగా ఉంది. జపాను దేశస్థులు చాలా దయ గలవారు, ప్రేమాస్పదులు. వారు కష్టజీవులు. అలాగే దైవభక్తి కలవారు. జపాను దేశంలో అందమయిన దేవాలయాలు చాలా ఉన్నాయి. అందులో బుద్ధ భగవాన్ విగ్రహాలు అనేక భంగిమల్లో కొన్ని చోట్ల పద్మాసనంలో కూర్చొని ధ్యానముద్రలో ఉంటే మరికొన్ని చోట్ల నిలబడినట్లుగా ఉన్నాయి. జపాను దేశం మనల్ని బుద్ధ భగవానుడికి దగ్గరగా చేర్చింది. ఆయన జీవితం గొప్ప స్ఫూర్తినందిస్తుంది.

గొప్పతనమంతా దయామయుడు, కరుణామయుడు అయిన బుద్ధ భగవానుడికే చెందుతుంది.

నేను మూడు సంవత్సరాల తర్వాత భారతదేశానికి తిరిగి వస్తున్నాను. జూన్ 1931 నేను భారతదేశం చేరుకున్నాను. సుశీలాదేవి జపాను దేశంలోనే ఆగిపోయి తర్వాత వచ్చే స్టీమరులో వచ్చే ఏర్పాట్లు చేసుకున్నారు.

స్టీమరు మద్రాసు ఓడరేవు చేరుకున్నప్పుడు నా కోసం ఎందరో భక్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆశ్రమవాసులు నాకు అభినందనలు తెలియచేయడానికి వచ్చారు. కమలాదేవి, ఆమె ముగ్గురు కుమార్తెలు ఎంతో గొప్పవారయిన మనోరమ, సుశీలా, సుమతి స్టీమరు రేవు చేరుకుంటున్నప్పుడు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తూ చేతిరుమాళ్ళు ఊపుతూ కనిపించారు. ఓడ రేవును చేరుకోగానే బంధువులు, స్నేహితులు హడావుడిగా పరుగెత్తుకొని వచ్చి నిచ్చెన ఎక్కి స్టీమరుపైకి చేరుకున్నారు. నాకిప్పుడు జపాను నుండి మద్రాసు చేర్చిన కార్గో స్టీమరు పేరు గుర్తు లేదు. అందులో చాలా కొద్ది మంది ప్రయాణీకులే ఉన్నారు. చాలా నెమ్మదిగా ప్రయాణించటం వలన నేను బాగా విశ్రాంతి తీసుకున్నాను. సూర్యోదయ సూర్యాస్తమయాలను ఆనందంగా తిలకించేవాడిని.

నాతో పాటు స్టీమరులో ప్రయాణం చేసిన వారు నా వద్దకు వచ్చి వీడ్కోలు తీసుకొని శాంతి ఆశ్రమానికి వీలయినంత తొందరలో వస్తామని వాగ్దానం చేసి వెళ్ళారు. ప్రతిసారి స్టీమరులో ప్రయాణం చేసేటప్పుడు నేను తోటి ప్రయాణీకులకు ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించి, ధ్యానము చేయించి వారికి సహాయం చేయటం అలవాటు. స్టీమరు నడిపించే కెప్టెన్ నుండి సేవలు అందించే క్యాబిన్ బోయ్ వరకు అందరికీ ఆధ్యాత్మిక శాంతి సందేశాలను వినిపించేవాడిని. నేను స్టీమరు ప్రయాణం చేసినా లేదా రైలులో అయినా, సముద్రంలో ప్రయాణం అయినా లేదా భూమి మీద అయినా నేను ఎల్లప్పుడూ ఒకే విషయాన్ని గుర్తు పెట్టుకునేవాడిని. అది ఎంతో స్ఫూర్తిని అందించి సహకరిస్తుంది.

**నీవు వెళ్ళే దారిలో గులాబీలను పరుచుకుంటూ సాగిపో…!**

**ఎందుకంటే మళ్ళీ ఈ దారిలో నీవు వస్తావో రావో కదా!**

కాబట్టి జపాను నుండి మద్రాసు చేరుకోవడానికి నేను ఎక్కిన కార్గో స్టీమరులో అదే ప్రయాణీకులతో మళ్ళీ నేను ప్రయాణించటం జరగని పని. అందువలన నా కర్తవ్యంగా భావించి వారందరికి శాంతి, ప్రేమ సందేశాలను పంచిపెట్టాను. నన్ను కల్సిన ప్రతి ఒక్కరికి ప్రేమను అందించాను. స్టీమరు ప్రయాణంలోనే కాదు, మద్రాసు నగరంలో కూడా అదే పనిచేశాను. శ్రీమతి మరియు శ్రీ ఆనందరావు గారు, ఇంకా అనేక మంది ఆశ్రమ భక్తులు అందరము కలిసి భజనలు, సంకీర్తనలు, సమావేశాలు, ప్రార్థనలు, ధ్యానము చేసేవారము. ప్రతి రోజు సాయంత్రము తప్పనిసరిగా సత్సంగము ఉండేది. మేమందరము ప్రపంచములోని భగవంతుని బిడ్డలందరూ శాంతిసౌఖ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించేవాళ్ళము.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు**

**అందరికీ శాంతి లభించుగాక!**

# భగవత్ కృప

మూలం : శ్రీ అఖండానంద సరస్వతీ అనువాదం : టి. ఛాయాకృష్ణ

## జయాపజయములు

(గత సంచిక తరువాయి)

శ్రీ శుకదేవుడిట్లనెను - పరీక్షిత్ ! ఎప్పుడైతే భగవంతుని చరణారవిందము సత్యలోకమునకు వెళ్ళినదో అప్పుడు బ్రహ్మ, సనకాదులు, గొప్ప గొప్ప యోగులు అక్కడికి వచ్చి వందనము చేసి పూజచేశారు. గంగామాత ఆచరణములు ప్రక్షాళన చేయగా కల్గిన జలమే. అది ముల్లోకములను పవిత్రము చేస్తుంది. దాని తర్వాత భగవంతుడు తన స్వరూపమును చిన్నదిగా చేసుకుని, తన విభూతులను సమీకరించారు. అప్పుడు బ్రహ్మాదులు అతనికి పూజ, బహుమానములను సమర్పించి అతనిని స్తుతించసాగిరి. ఋక్షరాజు జాంబవానుడు భేరి వాయించి అతనికి నలుదిక్కులా ప్రదక్షిణ చేశాడు. భగవంతునికి విజయ ఘోష చేశాడు. దైత్యులకు ఇదంతా చూడగానే చాల క్రోధము కలిగినది - మన ప్రభువు సర్వస్వం లాక్కున్నాడితడు- ఇతుడు బ్రాహ్మణుడు కాదు, విష్ణువు. ఇతనిని సంహరించడము మన ధర్మము అని అందరూ ఆయుధములను తీసుకుని భగవంతుని మీదికురికారు. ఇంతలో విష్ణుదూతలు ఎదుర్కొని వారిని కొట్టి కొట్టి పరుగెట్టించారు. దైత్యులను ఆపుతూ బలి ఇలా అన్నాడు - మీరు ఈ సమయంలో యుద్ధము చేయకండి. జయాపజయములు జరుగుతుంటాయి. ఏ కాలమయితే ముందు మనకు అనుకూలముగా వుండినదో, ఇప్పుడు ఆ కాలము వారికి అనుకూలముగా వున్నది. ఈ సమయంలో మనకు సమయము ప్రతికూలముగా వున్నది అందువలన ఇప్పుడు యుద్ధము అసలు చేయరాదు. ఎవరైన సరే కాలమునతిక్రమించలేరు. మేము దేవతలను చాల సార్లు జయించాము. ఒకసారి వారు జయిస్తే అభ్యంతర మేమున్నది. ఒకవేళ కాలము మనకు అనుకూలమైనప్పుడు మనము కూడా వారిని జయించగలము. మీరు ఆ సమయము కొరకు ప్రతీక్షించండి.

బలి మాటలను ఆలకించి దైత్యులందరూ రసాతలమునకు వెళ్ళిపోయారు. భగవంతుడు బలితో నిట్లనియె - నీవు నీ ధర్మ ఫలమును లోక-పరలోకములను నా కొసగితివి. కానీ ఇంకా మా మూడవ పాదము పూర్తి కాలేదు. గరుడుడు భగవంతుని ఇచ్ఛను తెలుసుకున్నాడు. అతడు వరుణ పాశముతో బలిని బంధించినాడు. హాహాకారములు చెలరేగినవి. వామనుడు బలితో నిట్లనెను - నీవు మూడడుగులు నేల ఇస్తానని ప్రతిజ్ఞ చేశావు. రెండడుగుల చోటు నాకు లభించినది. ఇక మూడవ పాదము కొరకు ఏర్పాట్లు చెయ్యి. ఒకవేళ నీవు మూడవ పాదము కొరకు స్థానము ఇవ్వకపోతే నీకు దుర్గతి కలుగుతుంది. నీవు నరకానికి వెళ్ళవలసివస్తుంది. ఎవరైతే ఇస్తానని ప్రతిజ్ఞ చేసి యాచకునికి ఇవ్వకుండా పోతారో వారు అధ: పతనమైపోతారు. నీవు నేను ఇస్తాను అని అహంకారంతో అన్నావు. దీనివలన నీవు నన్ను తిరస్కరించి నట్లయినది. ఇక నీవు దీనికి ఫలితము అనుభవింతుగాక!

(సశేషం)

# ఇతర మార్గమేమియు లేదు

స్వామి ఓంకార్

## ప్రతి శ్వాసలోను దైవనామ స్మరణ

మీరు ఈ ప్రపంచమునగల సమస్త శాస్త్రములను, వేదములను, బైబిల్ మొదలగు వాటినన్నింటిని చదివి యుండవచ్చు. ప్రాక్పశ్చిమమునగల ఋషుల, మౌనుల, మహా ప్రవక్తల ఉపదేశము లన్నింటిని విని యుండవచ్చును. ప్రపంచమున గల ఆధ్యాత్మిక సాధనలన్నింటిని అభ్యసించి యుండ వచ్చును. కాని ఎంతవరకు మీ పవిత్ర హృదయములో దైవనామమును స్మరింపరో, ఎంతవరకు మీ ప్రత్యణువు దైవనామముచే సంతృప్తి కాదో, అంతవరకు మీ కేమియి సహాయకారి కాజాలదు.

అవిరళమగు దైవనామస్మరణ కష్టములు, దు:ఖములు అను మేఘము లన్నింటిని పటాపంచలు గావించును. ఈ కలియుగమున, యాంత్రిక యుగము దైవనామస్మరణ ఒక్కటియే స్వేచ్ఛను, శాంతిని కలిగించును.

ఆ విధముగ మీరు నఖశిఖపర్యంతము దైవనామముచే నిండవలయును. ఆ విధమగు దైవానుభూతి అవిరళముగ పొందుటయే వాస్తవమగు మేలు చేకూర్చునది. మీ ప్రత్యణువు నందును ఆ అనంతుని యొక్క దివ్య చైతన్యమును గుర్తించుటకు సూటియైన, సరళమైన, సులభమైన మార్గము కాక మరెద్దియులేదు.

ఈ సాధన ఇప్పుడు, అప్పుడు, ఎప్పుడో ప్రార్థన ధ్యానాదులయందే చేయవలసినది కాదు. మీ జీవితకాల పర్యంతము ప్రతి హృదయ స్పందనమునందును ప్రతిశ్వాస యందును "అజప" సంస్మరణగా మారువరకును గావింపవలెను. అది రామనామమే కానిండు, సోహం భావనయే కానిండు, 'ఓం' కారోచ్ఛారణయే కానిండు లేక "శ్రీరామ జైరామ జైజైరామ ఓం" అనెడి మహా మంత్రమేకానిండు ఏదైనను ఆచరణ ముఖ్యావశ్యకము.

ఈ సాధనను యీ క్షణము నుండియే ఆరంభించుడు. మీ ప్రతి శ్వాసతోడను దైవనామ సంస్మరణ గావించుడు. మీ శరీరమునందలి రోమరోమమును దైవనామామృతముచే నింపివేయుడు. తైల ధారవలె, అవిచ్ఛిన్నముగ దైవనామము మీ నుండి ప్రసరించు గాక! ఇవియే శ్రవణ, మనన, నిధి ధ్యాస (వినుట, ఆలోచించుట, ధ్యానించుట)ల యొక్క సారమైయున్నది. నిశ్శబ్దముగ యీ విధముగ గావించు సాధనయే అమూల్యమగు మానవజన్మయొక్క గమ్యము, ధ్యేయమైయున్నది.

మనమందరము ఆ దైవముయొక్క సర్వజ్ఞత్వమునందును సర్వ వ్యాపకత్వము నందును, సర్వశక్తిత్వము నందును యుంటిమి.

మనమందరము తేజస్సులో నుంటిమి.

మనలోనే తేజస్సు కలదు.

మనమే తేజస్సై యుంటిమి.

ఓం తత్సత్ ఓం !

చిన్న ఏమరుపాటుకూడ అధిక నష్టమును కలిగించును.

ఆధ్యాత్మిక జీవితమును చిన్నచిన్న పొరపాటులు, ఏమరుపాటులుకూడ అధిక నష్టము కలిగించును.

దైవమును లేక ధర్మమును జీవితమున ఒక్క క్షణమైననుమరచుటయే మృత్యువు.

ఒకానొక కాలమున ఒక భక్తుడు అనేకవేల సంవత్సరములు స్వర్గద్వారములకడ ప్రార్థనలు సల్పుచు తలుపులు తెరువబడినప్పుడు లోనికి వెళ్ళుటకై నిరీక్షించెనట. అతడు అలసి, విసిగి చిన్న కునుకు తీసెను. ఆ సమయముననే ఆ ద్వారములు తెరువబడి తిరిగి మూసివేయబడెను. అతడచ్చటనే యుండిపోయెను. అదియెంతటి విచారకరము? క్షణ మాత్రము ఏమరుపాటుకూడ అనర్థములకు దారితీయునుకదా!

సత్యపథము సంకుచితము కష్టభూయిష్టము. ఆధ్యాత్మిక జీవితమనగా వాడికత్తిమీద నడచుటవంటిది.

ప్రశ్న : మృత్యు ప్రాయమైన దు:ఖముల నుండి కష్టముల నుండి తప్పించు కొనుటకు మనమేమి చేయవలయును?

జవాబు : జ్ఞానపూరితమగు యీ మాటలు జ్ఞప్తియందుంచుకొనుము.

దైవమును మరచుట యనగా సత్యమును, ధర్మమును మరచుటయే మృత్యువు. సత్యవ్రతులమై మన జీవితమున అనుక్షణము దైవమును స్మరించుచు జీవించుట అలవరచుకొందుము గాక! మనోవాక్కర్మలచే ఆ దైవ సాన్నిధ్యము ననుభవింతుముగాక!

ఎంతటి తిమిరాంధకారమునైనను తేజస్సు మటుమాయము చేయునట్లు తరతరముల పాపములనుకూడ దైవనామ సంస్మరణ హరింపజేయును.

కలలోనైనను "అహం" కారమనెడి సర్పమునోట చిక్కకుందుముగాక! మన ప్రతి శ్వాస దైవము వైపునకు, "సోహం" ధ్యానము వైపునకు మనలను నడుపుగాక!

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు.

ఓం తత్సత్ ఓం

(శాంతి జూన్ & జులై 1974)

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి

## తులసి సదా పవిత్రమైనదే

ఈ విషయము 'తులసీప్రాశస్త్యము' అను శీర్షిక యందు విపులీకరింప బడినది. కనుక కోయవలసిన తిథులలో దీనిని కోసి, కోయకూడని తిథులయందు ప్రయోగించినను దాని పావిత్ర్యము చెడదు. పాచి దోష మంటదు.

### తులసి వృక్షములోని సర్వభాగములు పవిత్రమైనవే.

**శ్లో॥ పత్రం, పుష్పం ఫలం కాష్ఠం, త్వక్ శాఖా పల్లవాంకురా: ।**
**తులసీసంభవం మూలం పావనం మృత్తికా ద్యపి ॥**

(ప్రహ్లాదసంహిత)

తులసియొక్క దళములు, వెన్నులు, పూలు, వేళ్ళు, కొమ్మలు, బెరడు కాండము, మట్టి మొక్కలు మొదలగు అన్ని భాగములు పవిత్రమయినవే అని పద్మపురాణము ఉత్తర ఖండము, ప్రహ్లాదసంహితలో ఉన్నది.

తులసీ నామమును ఉచ్చరింనంత మాత్రముననే అసురారియగు విష్ణు భగవానుడు ప్రసన్ను డగును. ఆ జీవుని పాపము లన్నియు నశించును. వానికి అక్షయమైన పుణ్యము సిద్ధించును. కలియుగములో సాలగ్రామమును ప్రతిదినము అర్చించుటకై ఎవని ఇంటిలో తులసి మొక్క పెరుగుచుండునో ఆ గృహస్థులు ధన్యాత్ములు తులసితో మధుసూదనుని పూజించుటవలన ఆ భక్తులందరు నరుని స్థితినుండి నారాయణస్థితికి (మోక్షమును) చేరుదురు.

### 17. తులసీవృక్షము సన్నిధిలో సర్వదేవతలు ఉన్నారు.

**శ్లో॥ తులసీ తరుమూలేషు పుణ్యగేహేషు పుణ్యదమ్ ।**
**అధిష్ఠానంచ, తీర్థానాం సర్వేషాంచ భవిష్యతి ॥**
**తత్రాపి సర్వదేవానాం మ మాధిష్ఠాన మేవచ ।**
**తులసీపత్రపతనప్రాప్త్యైవ చ వరాననే ॥**

(బ్రహ్మవైవర్తపురాణము, ప్రకృతి ఖండము 21-37-38)

తా॥ ఓ పార్వతీ! తులసి చెట్టులోని సర్వభాగములు పవిత్రమయినవే అను విషయమును తెలిసికొంటిమి కదా! ఆ పవిత్రతకు కారణము ఆయా భాగములన్నిటి యందును, సర్వదేవతలు నివసించుటయే అని పై శ్లోకము నిరూపించుచున్నది. తులసీవృక్షముయొక్క మూలమునందును, పుణ్యాత్ముల గృహముల యందును పుణ్యప్రదములయిన సర్వతీర్థములు ఉండును. అచ్చటనే సర్వదేవతలును నివసించుచుందురు. ఓ పార్వతీ! తులసీదళము వేసిన నీటితో స్నానము చేసినవారు సర్వతీర్థములయందును స్నానము చేసి నట్లగును.

అట్లే అతడు సమస్త దీక్షలను పొందినవానితో సమానుడగును. అని బ్రహ్మవైవర్త పురాణము చాటి చెప్పుచున్నది.

## 18. తులసీకాననపూజ

పాంచారాత్రగమమును, సర్వపురాణములను తులసీమాహాత్మ్యమును గూర్చి ప్రస్తావించినవి. తులసి మొక్కలు ఉన్న ప్రదేశమును 'తులసీవన' మందురు. అదే 'తులసీకానన' మనబడును. ఆ ప్రదేశము పెద్ద తీర్థమయిపోవును.

### ఎ. తులసీకాననపూజ విధానము

**శ్లో॥ గత్వా2థ భక్తిమాన్ శ్రీమత్తులస్యా: కాననే ప్రభుమ్ ।**
**సంపూజ్యాభ్యర్చ్య తాం చ శ్రీకృష్ణచరణప్రియామ్ ।**
**ప్రాగ్ దత్త్వార్ఘ్యం, తతో2 భర్చ్య గంధపుష్పా క్షతాదినా ।**
**స్తుత్వా భగవతీం తాం చ ప్రణమేత్ ప్రార్థ్య దండవత్ ।**

(స్కాందపురాణము)

భక్తిమంతుడైన మానవుడు తులసీవనములోనికి ప్రవేశించి, అచ్చట జనార్ద నునితోపాటు, శ్రీకృష్ణప్రియయగు తులసిని కూడ పూజింపవలెను. ఆ పూజలో ముందుగా తులసీదేవికి అర్ఘ్యము నీయవలెను. ఆ పిదప గంధపుష్పాక్షతాదులతో తులసిని, విష్ణువును పూజింపవలెను. ఈ విధముగా దేవతా స్వరూపిణియగు తులసీ వనదేవతను స్తుతించి, ప్రార్థించి, ఆమెకు సాష్టాంగ నమస్కారములను సమర్పింపవలెను.

ఓంకారం; అకార-ఉకార-మకారాలతో కూడి యున్నది. వేదాంత సూత్రాను సారంగా, అకారం స్థూలజగత్తును సూచిస్తున్నది. అంటే మనకు భౌతికంగా కనిపించే జగత్తును సూచిస్తుంది. ఇంద్రియ గోచరమైన జగత్తును సూచిస్తుంది. అంటే జాగ్రదవస్థలో కనుపించే సమస్తాన్ని అనగా జాగ్రత్ప్రపంచాన్ని జాగ్రదవస్థానుభజ్ఞును (విశ్వుని) సూచిస్తుంది. ఉకారం స్వప్న జగత్తులోని అనుభవాలనన్నింటినీ సూచిస్తుంది. ఉకారం స్వప్న ప్రపంచాన్ని, స్వప్నానుభవిని (తైజసుని) సూచిస్తుంది. మానసికరంగాన్ని, సూక్ష్మశరీరజగత్తును, స్వర్గనరకాలను సూచిస్తుంది. మకారం అజ్ఞానమైన సమస్తాన్ని, గాఢ సుషుప్తవ్యస్థను, జాగ్రదవస్థకు అజ్ఞానమైన సమస్తాన్ని, బుద్ధికి గోచరం గాని సమస్తాన్ని (ప్రాజ్ఞుని) సూచిస్తుంది ఈ విధంగా ఓంకారము లేక - అకారము, ఉకార, మకారము లు- మానవుని యొక్క అవస్థాత్రయమును, సమస్త జగత్తును, సూచిస్తాయి. అకార, ఉకార, మకారాలలో, ఈ మూడు అవస్థలలో కూడా పరివ్యాప్త మైయున్న అవినాశమైన, అఖండమైన, సత్య పదార్థాన్ని సూచించే "అమాత్ర" (సర్వసాక్షి లేక తురీయము) అనే ఏకైక సూత్రమున్నది.

**స్వామి శ్రీరామతీర్థ**

# తత్త్వమసి

## శ్రీ తెన్నేటి విశ్వనాథం

(క్రిందటి సంచిక తరువాయి)

### రంగము

(ప్రవేశము - ఋ॥కు॥లు శ్వేతకేతువు)

శ్వే॥ (దీర్ఘాలోచనాపరుడై) ఋషికుమారులార,ఆలోచించితిరా,ఈ సృష్టి వైచిత్ర్యము.

ఋ॥కు॥ ఇందు మనము మననశీలముగలిగి ఇట్టి జిజ్ఞాస గల వారుగ ఉండుటే బ్రహ్మయొక్క రచనాచిత్రత.

శ్వే॥ ఎవరా బ్రహ్మ.

ఋ॥కు॥ అదియేగద, నిన్నను మీ జనకునివలన విన్నది.

శ్వే॥ చరా చర లోకమంత పంచభూతాత్మకమైనది.

ఋ॥కు॥ మూడే అందు లెక్కకు వచ్చునవి. మూర్తిమంతమయిన సృష్టి విజ్ఞాతమగుటకు ఆకాశముమాట వాయువుమాట వదలుడు. అది తేజస్సుతోమిళితమై యుండును లెండి. పృధివి,జలము,తేజము లెక్కకు ప్రస్తుతము అవసరమైనవి.

2వఋ॥కు॥ తేజస్సుమాత్రము వదలవద్దా? ఆపోవై ఇదమగ్ర ఆసీత్-అనికదా మన గురువుగారి వాక్యము.

(ఉద్దాలకుడు-ప్రవేశము, అందరు లేచి పాదములు స్పృశించి నమస్కరింతురు.)

ఉ॥ ఏమిటి మీ గురువుగారి వాక్యములు?

ఋ॥కు॥ ఆపో వై ఇదమగ్రం ఆసీత్ - అని

ఉ॥ ఆలాగయిన-ఆపోవై ఇదమగ్రమ్-అని ఏలాగ వీలగును చెప్పుటకు?

శ్వే॥ మరి పృథివి మొదటిది అని చెప్పగలమా?

ఉ॥ నిన్నను చెప్పితినిగద, సత్పదార్ధము ఈచరాచరము నంతటకు కారణము-అని, నామరూప భేద కల్పన అంతయు దాని వీక్షణ, దాని సంకల్పము, దాని వ్యక్తీకరణము, తేజస్సు అనుకొనుము. జలము అను కొనుము, పృథివి అనుకొనుము; ప్రపంచమంతయు వీని సముదాయమే, వీని పరిణామమే, వీనివికారమే, వీని నామధేయములు వాగ్వ్యాపారమే, మూల మైనది ఒక నీరే.

శ్వే॥ మరియొకమారు చెప్పుడు.

ఉ॥ అగ్ని, ఆదిత్యుడు, చంద్రుడు, విద్యుత్తువీనిలోగల ఎరుపు అన్నది తేజస్సు, తెలుపు అన్నది జలము నలుపు అన్నది పృథివి.పృథివియే అన్నస్వరూపము అగ్నిత్వం, ఆదిత్యత్వం, చంద్రత్వం, విద్యుత్త్వం అన్నవి వాగ్వ్యాపారములు.

నామ ధేయములు మూలము ఒకటియే; మన పూర్వులు, పెద్దలు శ్రుతిసంపన్నులు, ఈమూడురూపముల మూలమును తెలిసికొనినారు. దీనిని తెలియుటవలననే వినుటకు వీలులేనిది సర్వము మననము కాలేదా? మననము కానిది సర్వము మననము కాలేదా? జ్ఞాతముకానిది సర్వము జ్ఞాతమయినట్లు లేదా?

ఋ॥కు॥శ్వే॥ (ఒక్క మారుగ ఉద్దాలకునిపాదములకు మ్రొక్కుదురు.)

ఉ॥ సర్వజ్ఞాభవన్తు.

శ్వే॥ మరి నాయనగారు, ఈ దేహేంద్రియ సంఘాతము.

ఉ॥ అవియు అంతే; శ్రద్ధగా వినుడు. సులభగ్రాహ్యము తేజస్సు, జలము, అన్నముల, పరిణామమే.

ఋ॥కు॥ చిత్తము, చిత్తము.

శ్వే॥ నాయనగారూ, కొంచెము వివరింపుడు. ఒకటి విజ్ఞాతమయిన యెడల సర్వము విజ్ఞాతమగునవి అంటిరిగదా!

ఉ॥ నాయనా, దిగ్బంధనము చేసికొని జాగ్రత్తగ వినుము. సృష్టికి పూర్వము శూన్యముగ ఉండెనన్నది పొరపాటు అని గ్రహించితివా?

శ్వే॥ ఆ

ఉ॥ ఏలాగు?

శ్వే॥ శూన్యమే అయినయెడల, శూన్యమును అనుభవించి పిమ్మట చెప్పగలుగు వాడుండుట కూడ అసంభవము.

ఉ॥ ఒక వేళ ఎవరైన మొదటలో 'అసద్వా' అని అన్నను దానిని విపరీతముగ అర్థము చేసికో కూడదు. అది నివారించుటకే అని గ్రహించు. కనుక ఈ కనిపించు ప్రపంచముయొక్క ఉత్పత్తి పూర్వము సత్తామాత్రమే ఉండి యున్నను, అది అఖండమైనది ఏకరస స్వరూపమైనది అనగ ముక్కలు చేయబోయినను ముక్కలు కానటువంటిది. వికారము అనగ విశేషమైన ఆకారమూ విశేష్యమైన ఆకారమూ కాలేనట్టిది. అది చిత్ మాత్రమైవది. విశ్వవ్యాప్తమైనది, బహిరంతరములందున్నది. అందుచేత అది నీయందును ఉన్నది. అదియే నేను అని స్ఫురణ కలిగించునది. అదియే నీవు. తత్ త్వం అసి. నామరూపక్రియాభేదములు తరువాత ఉత్పన్న మయినవి. అందుచే ఆ ఒకటియు విజ్ఞాతమైనయెడల మిగిలినవి నామరూపక్రియాభేదములే అని సర్వము విజ్ఞాత మగును.

శిష్యులు: స్వామీ, నామరూపక్రియా భేదములంటిరి ఎట్లా సంభవించును?

ఉ॥ శిష్యులైన గురువునైన ఈ వినుచున్న ఈఋషులూ మనమూ అందరమూ ఆ చిన్మాత్రమైన సదం సంభూతులమేగదా! అనగా అలాగా సంభవించినవారమే.

శ్వే॥ దీనికిమూలము విజ్ఞాతమయినయెడల సర్వము విజ్ఞాతమగును. అది వ్యష్టి సమిష్టిరూపముగ ఏ శక్తి చేత కాగలుగుచున్నది నాయనగారూ ?

ఉ॥ సావధానముగ నుండుడు. స్వకీయమైన శక్తిచే మాయాశక్తి అనగా మాయగాదు. ఇంద్రజాలమూ కాదు. యేన, మాతి, నిర్మాతి దేనివలన నిర్మాణము చేయబడునో ఆశక్తి, సంజ్ఞాకరముల సంపుటి మాయ వెంటనే ఏలాగా జరుగుచున్నదో సామాన్యముగ తెలియకపోవుటవలన ఏదో–మాయ అని పామరులనుచున్నారు. ఏదో మాయ అనగా ఏదో తమవంటివారికి అర్ధముకానిశక్తి అని వారిభావము.

మునులు: మరి సాధన ?

శ్వే॥ అవును, భగవాన్, చిన్మాత్రమై అవ్యక్తమై నామ రూపక్రియా భేద వస్తువ్యాపార శూన్యమైనప్పుడు–సాధన ఏది? ఏమై ఉండగలదు ?

ఉ॥ చిత్ – అనగా సర్వశక్తిసంయుతమైన ప్రజ్ఞ కదా!

శ్వే॥ అవును.

ఉ॥ అట్లయినచో పదార్ధముగాని ఆ సత్పదార్ధమునకు వీక్షణశక్తి ఉండగలదు.

మునులు: ఉండవచ్చును.

ఉ॥ సంకల్పము ఉండగలదా?

శ్వే॥ ఉండవచ్చును.

ఉ॥ వీక్షణాపూర్వక సకల్పమే మనకు దృశ్యమాన మైన జగత్తునకు కారణము అని అనవచ్చునా ?

శ్వే॥ అలాగుననే కన్పించుచున్నది.

ఉ॥ అయితే, తేజస్సు, ఉదకములు, పృధివి మొదలగు పంచభూతములకు మూలమైన తన్మాత్రలు ఆ చిన్మాత్రమైన దాని వీక్షణా సంకల్పమువలన కలిగినవే అనవచ్చును.

మునులు: అవునుస్వామి తేటపడిన దిపుడు.

ఉ॥ అది తేటపడినయెడల అనగ విజ్ఞాతమైన యెడల నామరూప భేద వస్తుజాలమంతా వాగ్వ్యాపారమే అని తేలినదిగదా! అవి అన్నియు విజ్ఞాతమైనట్లే గద. పాదరసము ఒకటి విజ్ఞాతమైనయెడల తజ్జనిత రసాయనిక పదార్ధములన్నియు విజ్ఞాతములైనట్లే కదా! త్రికాలా బాధితమైన ఆ చిత్పదార్థము విజ్ఞాతమైనయెడల కాల దేశ నామరూప క్రియా భేదములు కలిగినవి విజ్ఞాతములైనట్లే గదా !

(సశేషము)

# భీష్మ ఉవాచ

## శ్రీ మహాభారతము

### భీష్మ స్తవరాజము

(గత సంచిక తరువాత)

**మహతస్తమస: పారే పురుషం హ్యతితేజసమ్ ।**
**యం జ్ఞాత్వా మృత్యుమత్యేతి తస్మై జ్ఞేయాత్మనేనమః ॥ 41**

గొప్ప పెనుచీకటికి ఆవల ప్రకాశిస్తా డతడు. అతనిని తెలుసుకొంటే మృత్యువును తరించవచ్చు. అటువంటి జ్ఞేయాత్మకుడైన పరమాత్మునకు నమస్సులు. (41)

**యం బృహంతం బృహత్యుక్థే యమగ్నౌ యం మహాధ్వరే ।**
**యం విప్రసంఘా గాయంతి తస్మై వేదాత్మనే నమః ॥ 42**

మహాయజ్ఞాలలో, అగ్న్యాధానసమయంలో బహ్వృచములు ఆయనను చాలా పెద్దగా ప్రశంసిస్తాయి. విప్రసంఘాలు కీర్తించే ఆ వేదాత్మునకు నమస్కారం. (42)

**ఋగ్యజు:సామధామానం దశార్ధహవిరాత్మకమ్ ।**
**యం సప్తతంతుం తన్వంతి తస్మై యజ్ఞాత్మనే నమ: ॥ 43**

ఆయనకు ఋక్కులు. యజుస్సులు, సామములు నిలయం. పంచవిధ హవిస్సులూ అతని రూపమే. సప్త తంతువులు కల యజ్ఞాత్మునకు నమస్కారం. (43)

**చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవ చ ।**
**హూయతే చ పునర్ద్వాభ్యాం తస్మై హోమాత్మనే నమ: ॥44**

'ఆశ్రావయ' అనే నాలుగు అక్షరాలతో, అస్తు శ్రౌషట్ అనే నాలుగు అక్షరాలతో, 'యజ' అనే రెండక్షరాలతో, 'యే యజామహే' అనే అయిదు అక్షరాలతో, మళ్లీ 'వషట్' అనే రెండక్షరాలతో ఆయనకు హోమం చేస్తారు. ఆ హోమ స్వరూపునకు నమస్కారం. (44)

**య: సుపర్ణా యజుర్నామచ్ఛందోగాత్రస్త్రివృచ్ఛిరా: ।**
**రథంతరం బృహత్సామ తస్మై స్తోత్రాత్మనే నమ: ॥ 45**

వేద పురుషుడు, సువర్ణుడు, యజువనీ అతని పేర్లు – గాయత్రి మొదలయిన ఛందస్సులు ఆయన అవయవాలు. త్రివృత్తు అతని శిరస్సు. రథంతరం, బృహత్తు అనే వేదభాగాలు అతనికి ప్రీతి కలిగిస్తాయి. అట్టి స్తోత్రరూపునకు నమస్కారం. (45)

వి॥సం॥ త్రివృత్తు = యజ్ఞము. ఋగ్యజుస్సామములతో ప్రవర్తించే యజ్ఞం శిరస్సుగా కలవాడు 'త్రివృచ్ఛిరుడు' (నీల)

**య: సహస్రసమే సత్రే జజ్ఞే విశ్వసృజామృషి: ।**
**హిరణ్యపక్ష: శకుని: తస్మై హంసాత్మనే నమ: ॥ 46**

విశ్వసృష్టికర్తలు చేసిన వెయ్యేళ్ల సత్రయాగంలో బంగరు రెక్కలతో పుట్టిన హంసరూపుడయిన ఋషికి నమస్కారం. (46)

**పాదాంగం సంధిపర్వాణం స్వరవ్యంజనభూషణమ్ ।**
**యమాహురక్షరం దివ్యం తస్మై వాగాత్మనే నమ: ॥ 47**

పదసమూహం అంగాలుగా, సంధులు కణుపులుగా, స్వరాలు, వ్యంజనాలూ భూషణాలయి, దివ్యుడూ అక్షరరూపుడూ అని ప్రశంసింపబడే వాగ్రూపునకు నమస్సులు. (47)

**యజ్ఞాంగో యో వరాహో వై భూత్వా గాముజ్జహార హ ।**
**లోకత్రయహితార్థాయ తస్మై వీర్యాత్మనే నమ: ॥ 48**

యజ్ఞ శరీరు డయిన వరాహమై లోకహితంకోసం భూమిని ఉద్ధరించిన వీర్యాత్మునకు నమస్కారం. (48)

**య: శేతే యోగమాస్థాయ పర్యంకే నాగభూషితే ।**
**ఫణాసహస్రరచితే తస్మై నిద్రాత్మనే నమ: ॥ 49**

పాములు అలంకారాలైన, వేయిపడగల శయనం మీద యోగం ధరించి నిద్రించిన యోగ నిద్ర స్వరూపునకు నమస్కారం. (49)

**విశ్వే చ మరుతశ్చైవ రుద్రాదిత్యాశ్వినావపి ।**
**వసవ: సిద్ధసాధ్యాశ్చ తస్మై దేవాత్మనే నమ: ॥**

విశ్వేదేవులు, మరుద్గణాలు, రుద్రులు, ఆదిత్యులు, అశ్వినీ దేవతలు, వసువులు, సిద్ధులు, సాధ్యులూ అందరూ ఆయన విభూతులే. అట్టి దేవ స్వరూపునకు నమస్సు.

**అవ్యక్తబుద్ధ్యహంకారమనోబుద్ధీంద్రియాణిచ ।**
**తన్మాత్రాణి విశేషాశ్చ తస్మై తత్త్వాత్మనే నమ: ॥**

అవ్యక్తమయిన ప్రకృతి, బుద్ధి, అహంకారం, మనస్సు, జ్ఞానేంద్రియాలు, తన్మాత్రలు, వాని కార్యాలు, అన్నీ ఆయన స్వరూపాలే. అటువంటి తత్త్వమయునకు నమస్సులు.

**భూతం భవ్యం భవిష్యచ్చ భూతాదిప్రభవాప్యయ: ।**
**యో2గ్రజ: సర్వభూతానాం తస్మై భూతాత్మనే నమ: ॥**

భూతం, వర్తమానం, భవిష్యత్తు అతడే. ప్రాణుల ఉత్పత్తి ప్రళయాలకు కారణం అతడే. భూతాలన్నింటికీ ముందుపుట్టిన వాడు అతడే. అటువంటి భూతాత్మకునికి నమస్కారం.

# శ్రీ యమధర్మరాజు ప్రోక్త శివకేశవ స్తుతి

మల్లాది శ్రీహరిశాస్త్రి

1. ఓం గోవిందాయ నమ:
2. ఓం మాధవాయ నమ:
3. ఓం ముకుందాయ నమ:
4. ఓం హరయే నమ:
5. ఓం మురారయే నమ:
6. ఓం శంభవే నమ:
7. ఓం శివేశాయ నమ:
8. ఓం శశిశేఖరాయ నమ:
9. ఓం శూల పాణయే నమ:
10. ఓం దామోదరాయ నమ:
11. ఓం అచ్యుతాయ నమ:
12. ఓం జనార్ధనాయ నమ:
13. ఓం వాసుదేవాయ నమ:
14. ఓం గంగాధరాయ నమ:
15. ఓం అంధక రిపవే నమ:
16. ఓం హరాయ నమ:
17. ఓం నీల కంఠాయ నమ:
18. ఓం వైకుంఠాయ నమ:
19. ఓం కైటభరిపవే నమ:
20. ఓం కమఠాయ నమ:
21. ఓం అబ్జ పాణయే నమ:
22. ఓం భూతే శాయ నమ:
23. ఓం ఖండ పరశవే నమ:
24. ఓం మృడాయ నమ:
25. ఓం చండికేశాయ నమ:
26. ఓం విష్ణవే నమ:
27. ఓం నరసింహాయ నమ:
28. ఓం మధు సూదనాయ నమ:
29. ఓం చక్ర పాణినే నమ:
30. ఓం గౌరీపతయే నమ:
31. ఓం గిరి శాయ నమ:
32. ఓం శంకరాయ నమ:
33. ఓం చంద్ర చూడాయ నమ:
34. ఓం నారాయణాయ నమ:
35. ఓం అసుర నిబర్హణాయ నమ:
36. ఓం శార్ఙ్గ పాణయే నమ:
37. ఓం మృత్యుం జయాయ నమ:
38. ఓం ఉగ్రాయ నమ:
39. ఓం విషమేక్షణాయ నమ:
40. ఓం కామశత్రవే నమ:
41. ఓం శ్రీకాంతాయ నమ:
42. ఓం పీతవసనాయ నమ:
43. ఓం అంబుదనీలాయ నమ:
44. ఓం శౌరయే నమ:
45. ఓం ఈశానాయ నమ:
46. ఓం కృత్తి వసనాయ నమ:
47. ఓం త్రి దశైక నాథాయ నమ:
48. ఓం లక్ష్మీ పతే నమ:
49. ఓం మధురిపవే నమ:
50. ఓం పురుషోత్తమాయ నమ:
51. ఓం ఆద్యాయ నమ:
52. ఓం శ్రీ కంఠాయ నమ:
53. ఓం దిగ్వసనాయ నమ:
54 ఓం శాంతాయ నమ:
55. ఓం పినాకపాణయే నమ:
56. ఓం ఆనంద కందాయ నమ:
57. ఓం ధరణీ ధరాయ నమ:
58. ఓం పద్మనాభాయ నమ:
59. ఓం సర్వేశ్వరాయ నమ:
60. ఓం త్రిపుర సూదనాయ నమ:

| | |
|---|---|
| 61. ఓం దేవదేవాయ నమః | 85. ఓం భర్గాయ నమః |
| 62. ఓం బ్రహ్మణ్యాయ నమః | 86. ఓం త్రినేత్రాయ నమః |
| 63. ఓం దేవాయ నమః | 87. ఓం భవాయ నమః |
| 64. ఓం గరుదధ్వజాయ నమః | 88. ఓం భూతపతయే నమః |
| 65. ఓం శంఖపాణయే నమః | 89. ఓం పురారయే నమః |
| 66. ఓం త్ర్యక్షాయ నమః | 90. ఓం గోపీపతయే నమః |
| 67. ఓం ఉరగా భరణాయ నమః | 91. ఓం యదుపతయే నమః |
| 68. ఓం బాలమృగాంకమౌళయే నమః | 92. ఓం వసుదేవసూనవే నమః |
| 69. ఓం శ్రీరామాయ నమః | 93. ఓం కర్పూర గౌరాయ నమః |
| 70. ఓం రాఘవాయ నమః | 94. ఓం వృషభ ధ్వజాయ నమః |
| 71. ఓం రమేశ్వరాయ నమః | 95. ఓం ఫాల నేత్రాయ నమః |
| 72. ఓం రావణారయే నమః | 96. ఓం గోవర్ధ నోద్ధరణాయ నమః |
| 73. ఓం భూతేశాయ నమః | 97. ఓం ధర్మ ధురీణాయ నమః |
| 74. ఓం మన్మథరిపవే నమః | 98. ఓం గోపాయ నమః |
| 75. ఓం ప్రమథాధినాథాయ నమః | 99. ఓం స్థాణవే నమః |
| 76. ఓం చాణూరమర్దనాయ నమః | 100. ఓం త్రిలోచనాయ నమః |
| 77. ఓం హృషీక పతయే నమః | 101. ఓం పినాక ధరాయ నమః |
| 78. ఓం మురారయే నమః | 102. ఓం స్మరారయే నమః |
| 79. ఓం శూలినే నమః | 103. ఓం కృష్ణాయ నమః |
| 80. ఓం గిరీశాయ నమః | 104. ఓం అనిరుద్ధాయ నమః |
| 81. ఓం రజనీశకళావతంసాయ నమః | 105. ఓం కమలాకరాయ నమః |
| 82. ఓం కంస ప్రణాశనాయ నమః | 106. ఓం కల్మషారయే నమః |
| 83. ఓం సనాతనాయ నమః | 107. ఓం విశ్వేశ్వరాయ నమః |
| 84. ఓం కేశినాశాయ నమః | 108. ఓం త్రిపదగార్ద్ర జటాకలాపాయ నమః |

## ఫలశ్రుతి

ఈ శివకేశవుల అష్టోత్తరశతనామావళితో కూడిన "శివకేశవస్తుతి నిత్యము పఠించువారిని యమధర్మరాజు, యమభటులు సమీపింపరు, దర్శింపరు. యమధర్మ రాజప్రోక్తమై సకల పాపహరమగు ఈ స్తోత్రము సతతము జపించువారికి పునర్జన్మయుండదు.

(కా.ఖం-అ. 8)

# కమలాకర చరిత్రము

## గురుకృపతో సాధ్యము కానిది లేదు

మహాపుణ్యక్షేత్రము భూలోక వైకుంఠము అయిన శ్రీ పండరిపురము నందు ఉత్తమ పురుషుడు, సకల శాస్త్రప్రవీణుడు, భగవంతుని దర్శించవలెననెడి మిక్కిలి కోరిక కలవాడు, భేదభావము లేనివాడు, జ్ఞానశీలుడు భగవద్భక్తులలో మిక్కిలి గొప్పవాడును అయిన కమలాకరుడు నివసించుచుండెను. అతనికి పతివ్రతా శిరోమణి, మహాలక్ష్మి కటాక్షము కలిగినది, వినయవివేక జ్ఞానములు కలిగినది, భగవంతుని సేవ యందు అమితాసక్తి కలది అయిన సుమతి అను పేరుగల భార్య, అయిదు సంవత్సరముల పద్మాకరుడనే పేరుగల కొడుకు కలరు. వీరు ప్రతిరోజు చంద్రభాగా నదిలో స్నానము చేసి నిత్య పూజాది కార్యక్రమములు పూర్తిచేసుకొని ఇంటి యందు వైష్ణవ చిహ్నములను ధరించి భగవన్నామ స్మరణము చేయుచు ఊరిలోనున్న ప్రతీ యింటికి పోయి భిక్షమెత్తి, భాగవతులను అర్ఘ్యపాద్యాదులచే పూజించి భగవంతునికి నైవేద్యము చేసిన అన్నము ఆ భాగవతులకు తృప్తిపడునట్లుగా పెట్టి మిగిలిన అన్నమును తాము తిని ఎల్లప్పుడు భగవన్నామ సంకీర్తనలతో గడుపుచుండిరి.

ఒకరోజు కమలాకరుడు, అతని కుమారుడు తెల్లవారకుండా లేచి స్నానాదులు చేసి భిక్షాటమునకు వెళ్ళిరి. వారికి ఒకచోట జ్ఞానానుష్ఠాన సంపన్నులు, శాంతి, దమము, శమము మొదలగు కళ్యాణగుణములు కలవారు, భగవధ్యానము నందే మునిగిన వారు, భగవద్భక్తులు, భగవత్కటాక్షముచే జన్మించిన వారు మహాత్ములును అగు నివర్తిదేవుడు, జ్ఞానదేవుడు, సోపాన దేవుడు, ముక్తాబాయి, నామదేవుడు, గోరా కుంభారుడు, ఛాంగ దేవుడు, కబీరుదాసు మొదలగు వారు శ్రీహరినామ సంకీర్తనము చేసుకొను చుండిరి వారిని చూసి కమలాకరుడు పద్మాకరునితో కలసి సాష్టాంగ దండ ప్రణామములు చేసెను. వేయి విధములుగా వారిని స్తోత్రము చేసెను. తన తపః ఫలితముగా వారి దర్శనమైనదని వారందరిని తన యింటికి వచ్చి పావనము చేయవలసినదిగా వారిని ప్రార్థించెను.

వారును అతని భక్తికి సంతోషించిరి. మీరు విష్ణు భక్తులు భాగవతు భక్తులు అయివున్నారు. మేము చాలా మందిమి వుంటిమి. మమ్ముల నందరిని సంతుష్టులను చేయట కష్టముకదా ! మీ భక్తి విశ్వాసములే మా మనస్సులకు ఆనందము కలిగించును. అదియే చాలు అనిరి. అందుకు కమలాకరుడు రుక్మిణి విఠలనాథులు యీ దాసునికి తల్లితండ్రులు. వారు అఖండ ఐశ్వర్యము కలవారై యీ అనంత బ్రహ్మాండమును పోషించుచున్నారు. వారి అనుగ్రహ సంపదతో నిండియున్న నాకు ఎటువంటి కష్టమును లేదు. కావున మీరు వచ్చి యీ దాసుడు చేయు పూజలను అంగీకరించవలయునని ప్రార్థించేను. అపుడు ఆ సాధువులు తాము స్నానములు చేసిన తరువాత కమలాకరుని యింటికి వచ్చెదమనిరి. కమలాకరుడు సంతోషమతో యింటికి వచ్చి భార్య సుమతీ దేవితో యీరోజు మనింటికి మహామహులు, జ్ఞానానుష్ఠాన సంపన్నులు అయిన

భాగవతోత్తములు అనేకులు వచ్చుచున్నారు. వారందరి కొరకు భోజనము సిద్ధము చేయుమని చెప్పెను. తాను వారిని తీసుకొని వచ్చుటకు వెళ్ళెను. సుమతీ దేవి కావలసిన వస్తువుల నన్నింటిని పొరుగింటి నుండి అప్పుతీసుకొని శ్రద్ధతో వంట చేయచుండగా వంటచెరుకు తక్కువయ్యెను. కుమారుడైన పద్మాకరుని కొన్నిపిడకలు తెమ్మని పంపెను. పిడకలలో నున్నపాము పద్మాకరుని కరచెను. వెంటనే ఆపిల్లవాడు గట్టిగా ఏడ్చెను. ఏడుపు విని సుమతి అచటకి పరుగెత్తి విషయమును తెలుసుకొనెను. విషము శరీరమునకు ఎక్కి పద్మాకరుడు మరణించెను. అంత దు:ఖములోను సుమతి శ్రీహరిదాసుల ఆరాధనకు ఆటంకము లేకుండగా కొడుకు నెత్తుకొని యింటిలో ఒకమూల పరుండబెట్టెను. తను స్నానము జేసి వంట ముగించి సాధువుల రాకకై ఎదురుచూచు చుండెను.

కమలాకరుడు సాధువుల నందరిని తీసుకొని వచ్చి అర్ఘ్యపాద్యాదులచే పూజించి వారి పాదతీర్థము తీసుకొనెను. భగవంతునికి పూజచేసి, భగవంతునికి నైవేద్యము పెట్టిన అన్నమును వారికి వడ్డించి భోంచేయుడని వేడేను. అపుడు నామదేవుడు శ్రీకృష్ణ మూర్తిని స్మరించెను. నామదేవుడు స్మరించినంతనే వచ్చునట్టి శ్రీకృష్ణ మూర్తి రాలేదు. నామదేవుడు కలతచెంది ఎన్నిరకములుగా స్తోత్రము చేసినను భగవంతుడు ప్రత్యక్షమవకుండుటచే ఆలోచించి జ్ఞాన దృష్టిచే కారణము తెలుసుకొనెను. కమలాకరునితో మీ పుత్రుని కూడ మనతో తినుటకు రమ్మని పిలువమనెను.

సుమతీ దేవి చేతులు జోడించి పద్మాకరుడు తిని నిద్ర పోవుచున్నాడని చెప్పెను. నామదేవుడు మీ కుమారుడు లేకుండ మేము ప్రసాదము తినము. అతనిని లేపి తీసుకొనిరమ్మనెను. వాడు ఎంత లేపినా లేవకున్నాడు. మీరందరు ప్రసాదమును స్వీకరింపుడని సుమతీ దేవి మరల నామదేవుని ప్రార్థించెను. వెంటనే నామదేవుడు శ్రీ విఠలనాథుని పాదపద్మములను తలచి శ్రీహరి సంకీర్తనము చేసి, నీవు రాని యెడల మేము ప్రసాదము స్వీకరించమని మానసిక ధ్యానము చేసెను. భగవంతుడు వచ్చి నీ కోరిక ఏమని అడిగెను. నామదేవుడు యీ సుమతి పుత్రుడు నిద్రలేచి మాతో కూర్చిని భుజించునట్లు చేయుమనెను.

భగవంతుని విశేషమైన దయతో పద్మాకరుడు లేచి తల్లిని పిలిచి దాహమునకు మంచినీరు తెమ్మనమని అడిగెను. కుమారుని గొంతు విని సుమతి త్వరగా పోయి అతనిని హత్తుకొని తలను ముద్దుపెట్టుకొని గెడ్డము నిమిరెను. వానిని శ్రీహరిదాసుల సన్నిధికి తీసుకొని వచ్చి నామదేవుని పాదములపై పడవేసెను. దేవర వారి వలన మా దు:ఖము పలాయన మయ్యెనని చెప్పెను. సాధువులందరు మీ బిడ్డనికి ఏమి జరిగినదని అడుగగా జరిగినదంతయు చెప్పెను. సాధు శ్రేష్ఠులందరు అపుడు నామదేవుని చూచి మీరు సాక్షాత్తూ భగవదంశముతో పుట్టిన వారని అనేక విధములుగా స్తోత్రము చేసిరి.

అపుడందరును ఆబాలాని తో కలసి పరమానందముతో భుజించి భోజనము తరువాత కాళ్ళూ చేతులు కడుక్కొని కొంత సేపు విశ్రాతి తీసుకొనిరి. తరువాత వారు ఆకుటుంబమును ఆశీర్వదించిరి. కమలాకరుడు నామదేవునితో దైవకటాక్షము కలుగునట్లు చేయుమని వేయివిధములుగా ప్రార్ధించెను. వారి జ్ఞానానుష్ఠాన వినయ వివేకములకు సంతోషించి నామదేవుడు ఆముగ్గురికి కృష్ణమంత్రము నుపదేశించి దానినెట్లు ఆచరించ వలెనో బోధించెను. వారు ముగ్గురు నామదేవునికి సాష్టాంగ ప్రణామము చేసి ఆభాగవతులు తినగా మిగిలిన అన్నమును తిని వారికి ప్రదక్షిణ నమస్కారములు చేసిరి. వారు వీరిని దీవించి తమ నివాసములకు వెళ్ళిరి కమలాకరుడు యథాప్రకారము భిక్షాటనము చేయుచు సాధు జనారాధనము చేయుచుండెను.

అటులుండగా భగవంతుడు ఒకరోజు వృద్ధ బ్రాహ్మణ వేషముతో కమలాకరుని యింటికి పోయెను. అపుడు సుమతీ దేవి మాత్రమునే యింట నుండెను. సాధ్వీ! నాకు ఆకలిబాధ ఎక్కువుగా వున్నది. ప్రాణముపోవుచున్నట్లున్నది. గంజినీళ్ళయినా యిచ్చి కాపాడమని ఆమెతో భగవంతుడనెను. ఆదినము వారింట ఏమియు లేదు. సుమతీదేవి పొరుగింటికి పోయి కావలసిన సరుకులను అప్పుతెచ్చి, వండి భోజనము పెట్టెను, భోజనానంతరము మెత్తని పక్కపై పరుండమని, ఆవృద్ధబ్రాహ్మణుని పాదములు వత్తుచుండెను. కమలాకరుడు కొడుకుతో కూడ యింటికి వచ్చి, సుమతి చేసిన అతిధిపూజకు సంతోషించి, నేను తెచ్చిన సరుకులతో నీవు వంట చేయుము. నేనీ అతిథికి పాదములు వత్తెదననెను. పద్మాకరుడు విసరుచుండెను. వీరి ఉపచారములకు, భగవంతుని యందు భాగవతుల యందు వీరికి గల భక్తిశ్రద్ధలకు భగవంతుడు సంతోషించి సుఖముగా నిద్రించెను. సుమతి వంట చేసినను. భగవతునికి నిద్రాభంగము చేయకూడదని ఆకలి దప్పులను మరచి సేవచేయుచుండిరి. ఆభాగవతుడు రాత్రి ఒక ఝాము గడిచిన తరువాత లేచి మీరింకా ప్రసాద స్వీకారము చేయలేదా! ఇకనైన భోజనము చేయుడనెను. వారికోరిక ప్రకారము మరల వారితో ప్రసాద స్వీకారము చేసి విశ్రాంతి తీసుకొనెను. సుమతీ దేవి కూడ భోజనము చేసి వచ్చెను. భగవంతుడు వీరి భక్తికి అత్యానందము పొంది నిజస్వరూపము చూపెను. కమలాకరుని కుటుంబము బ్రహ్మానందముతో సాష్టాంగ వందనములు చేసి, చేతులు జోడించి అనేక విధములుగా స్తోత్రములు చేసిరి. భగవంతుడు వారితో మీరు నా అనుగ్రహమునకు పాత్రులైరి. నేను మీ హృదయ పద్మములందు ఎల్లప్పుడు నివాసము చేయుదునని ఆశీర్వదించి అదృశ్యుడయ్యెను.

అది మొదలు కమలాకరాదులు భగవదనుగ్రహ విశేషముచే ఏ లోటు లేక గృహస్థాశ్రమ ధర్మములను ఆచరించుచు మహదానందమును అనుభవించుచు అంత్య కాలమున పరమ పదమలంకరించిరి.

(పై కథ కోయిల్ ధనాల దేవరాజ స్వామి విరచిత “ఆది పాండురంగ భక్త విజయము” నుండి శ్రీమతి ఎమ్. వరలక్ష్మి గారిచే సరళీకరణ)

# సాధువుగారి కౌపీనము

**మూలము : శ్రీ రామకృష్ణ పరమహంస** **అనువాదము : గరిగిపాటి కృష్ణ**

## గురూపదేశాన్ని విస్మరించిన సాధువు

ఒకనొక సాధువు తమ గురువు ఆదేశమునను సరించి తన నివాసము కొరకు ఒక చిన్న తాటాకు గుడిసెను నిర్మించుకొన్నాడు. ఆ గుడిసె ఊరికి దూరంగా ఎక్కువ జన సంచారము లేనిచోట కట్టుకున్నాడు. అలా ఆ సాధువు తన అధ్యాత్మిక సాధన ఆ గుడిసెలో ప్రారంభించాడు. ప్రాత:కాలంలో తన దైనందిన కాలకృత్యాలను తీర్చుకున్నపిదప, అతడు అంగీ మరియు గోచీగుడ్డను గుడిసెబయట ఒక చెట్టు మీద ఆరబెట్టుకొనేవాడు. ఒకరోజు ఆ సాధువు పక్క ఊరికి బిక్షకై వెళ్ళి తిరిగివచ్చి, తన గోచీగుడ్డను ఎలుకలు కొరికి కన్నాలు పెట్టడం చూశాడు. దానివల్ల అతడు ఒక కొత్తకౌపీనము కొరకు పక్క ఊరికి వెళ్ళవలసివచ్చింది. అటుతరువాత అతడు తన కౌపీనమును గుడిసె పైభాగములో ఆరబెట్టి ఎప్పటిలాగే భిక్షకై వెళ్ళాడు. తిరిగివచ్చి చూస్తే ఆ కౌపీనము కూడా ఎలుకలచే కొరకబడి పీలికలై పడి ఉంది. అతడికి ఒక్కసారిగా పట్టరాని ఆవేశము కలిగి ఇలా అనుకున్నాడు. ఈ చిన్న గుడ్డకోసమని ఎవరిని అర్థించాలి? దానికోసమని ఎక్కడికి వెళ్ళను? ఇదిలావుంటే మరుసటిదినము అతనికి కొంతమంది గ్రామస్థులు తారసిల్లి ఈ విధంగా అన్నారు, “నీ కొరకు ఎవరు మాత్రం రోజూ బట్ట ఇవ్వగలరు? అందుకని ఒక పని చెయ్యి. ఒక పిల్లిని పెంచుకో. అప్పుడు పిల్లి భయానికి ఎలుకలు నీవద్దకు రాకుండా వుంటాయి.” అంత ఆ సాధువు వెంటనే గ్రామమునకు వెళ్ళి ఒక పిల్లిని తన వెంట తెచ్చాడు. ఆ నాటి నుండి ఆ సాధువుకు ఎలుకల బెడద తప్పి ఎంతో సంతోషంగా తన సాధన కొనసాగించాడు. అంతటితో ఆగక ఆ సాధువు గ్రామస్థులను అర్థించి కొన్ని పాలను తీసుకొని వచ్చి ఆపిల్లికి తాగిస్తూ దానిని ఎంతో ప్రేమగా చూసుకోసాగాడు. కొన్ని రోజులు గడిచాక, ఒకానొక గ్రామస్థుడు అతనితో ఇలా అన్నాడు, “ఓ సాధు మహాశయా! నీకు ప్రతి రోజూ పాలు అవసరమని తెలిసింది. కాని నీ అవసరానికి ఎవరైనా కొన్ని రోజులు మాత్రమే పాలను ఇవ్వగలరు, కాని సంవత్సరకాలమంతా నీకు పాలను ఎవరు ఇవ్వగలరు. అందుకని నా మాటను విని నీవు ఒక ఆవును తెచ్చి పెట్టుకో. అలా చేస్తే నీవు ఆవుపాలను స్వంతానికి వాడుకోవడమే గాక నీ దగ్గరున్న పిల్లికి కూడా త్రాగించవచ్చు.’ ఈ ఆలోచన బాగానే ఉందనుకొని మన సాధువు పాలిచ్చే ఆవుని ఒకదాన్ని మొత్తానికి ఎలాగో ఒకలాగ సంపాదించాడు. ఇక అప్పటినుండి అతనికి

పాలకోసం యాచించవలసిన అగత్యం తొలగిపోయింది. అలా కొన్ని రోజులు గడిచిన తరువాత ఆవు మేతకై గడ్డి కావలసివచ్చింది. అప్పుడు అతను దగ్గర ఉన్న గ్రామాలకు వెళ్ళి అడిగితే ఆ గ్రామస్థులు, “నీ గుడిసె చుట్టూ కావలసినన్ని పంట పొలాలు నిష్ప్రయోజనంగా ఉన్నాయి. వాటిని సాగు చేసుకుంటే నీకు గడ్డి కోసమని యాచించవలసిన అవసరం రాదు.” ఆ గ్రామస్థులమాట ప్రకారం మన సాధువు తన గుడిసెకు సమీపంలో గల పొలాలను దున్న సాగాడు. ఐతే పొలం దున్నడం తన ఒక్కడివల్లా అయ్యేపని కాదని తెలిసికొని, కొంతమంది కూలీలను పనిలో పెట్టుకున్నాడు. ఇంత జరిగాక కూడా, తన పంటను నిలవ వుంచుకోవడానికి గోదాము లేదే అనుకుని ఒక గోదాము నిర్మించాడు. అలా కొంతకాలము గడిచేసరికి ఆ సాధువు ఒక భూస్వామిగా మారాడు. చివరికి తన ఇంటి వ్యవహారాలు చక్కబెట్టడానికి ఒక భార్యను కూడా తెచ్చుకున్నాడు. ఆ విధంగా సాధువు కాలాంతరంలో ఒక తీరికలేని గృహస్థుగా మారాడు.

కొంత కాలము అయిన పిమ్మట అతని గురువు శిష్యుని ప్రగతిని చూద్దామని వచ్చాడు. తన శిష్యుని చుట్టూఉన్న వస్తుసముదాయమును చూసి ఒకింత ఆశ్చర్యమునకు లోనై, తన శిష్యుని పనివాడిని ఈ విధంగా ప్రశ్నించాడు, “ఒక సాధువు ఈ గుడిసెలో ఉండేవాడు. ఇప్పుడు అతను ఎక్కడ ఉన్నాడో చెప్పగలవా? ఆ పనివాడికి గురువుగారికి జవాబెలా చెప్పాలో అర్థంకాలేదు. అప్పుడు గురువు అసలు విషయం తెలుసుకునే ఆలోచనతో ఆ ఇంట్లోకి ప్రవేశించి, తన శిష్యుని కలుసుకున్నాడు.

గురువు శిష్యునితో ఇలా అన్నాడు, “నాయనా! ఏమిటిదంతా?” శిష్యుడు సిగ్గుతో గురువుగారి పాదములను పట్టుకొని, “గురుదేవా, ఏమి చేయను? దీనంతటికీ ఒక కౌపీనమే కారణము., నన్ను మన్నించండి,” అన్నాడు.

<u>ఓం</u> అనే అక్షరము పరమాత్మకు ప్రియమగు నామధేయముగా నున్నది. ఎందుకనగా ఓంకారో చ్చారణము చేతనే పరమాత్మ ప్రసన్నుడగుచున్నాడు. భగవంతుని విగ్రహాదులు ఎటుల భగవంతుని ప్రతీకములై (జ్ఞాపకములై)యున్నవో, అటులనే ప్రణవము పరమాత్మకు ప్రతీకముగనున్నది. ఈ ప్రకారము పరమాత్మకు నామ ధేయముగాను, ప్రతీకముగాను యున్నందు చేత ఓంకారము పరమాత్మోపాసనకు ముఖ్యసాధనమని సర్వవేదాన్త సిద్ధాన్తము. కనుక ఓం అనే యీ అక్షరాత్మకమగు ఉద్గీతశబ్దవాచ్యమగు ప్రణవమునుపాసించుడు.

**సాధు గోవింద స్వామి**

# FORM-IV

(SEE RULE-8)

| | | |
|---|---|---|
| 1. Name of the Magazine | : | Peace |
| 2. Place of Publication | : | The Mission of Peace<br>Sri Santi Ashram, Via Sankhavaram,<br>Thotapalli, E. G. Dist.,-533446. A.P. |
| 3. Periodicity of the Publication: | | Quarterly |
| 4. Printer's name and address | : | Prop. YAPR Murthy<br>Padmanabha Offset Printers<br>Nageswararao Street,<br>Ramaraopeta, Kakinada-533 004.<br>E.G.Dist., A.P. |
| Whether Citizen of India | : | Yes |
| (If foreigner, State the Country<br>Of Origin) | : | Not Applicable |
| 5. Publisher's Name | : | Swamini Vinamrananda |
| Whether Citizen of India | : | Yes |
| 6. Editor's Name | : | Swamini Vinamrananda |
| 7. Address | : | The Mission of Peace,<br>Sri Santi Ashram, Via Sankhavaram<br>Thotapalli, E. G. Dist., -533466. A.P. |
| 8. Name and address of Individuals who own the Sripaper and more than one percent of the total capital | : | The Board of Trustees and the Committee of Management of Santi Ashram (Regd)<br>Sri Santi Ashram Post, Via<br>Sankhavaram, E.G.Dist., A. P. -533466 |

I, Publisher, Sri Santi Ashram, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

**Swamini Vinamrananda**
Publisher
The Mission of Peace,
Sri Santi Ashram

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 – 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి – 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266–271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ – 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం–533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

## కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 1.3.2022 (మంగళవారము):** "శివరాత్రి" సందర్భంగా ఉ॥ 8గం॥లకు రుద్రాభిషేకము రాత్రి 8 గం॥లకు సహస్రజ్యోతి లింగార్చనము విశ్వనాథ మందిరమునందు అన్నవరం దేవస్థాన వేద పండితులచే నిర్వహించబడును.

**తేది 17.3.2022 (గురువారము):** "హోలీ" సందర్భంగా ఉ॥ 7:30 ని॥లకు శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన (గోశాల)

పై కార్యక్రమములు

శ్రీ గణేష్ ఆచార్య & శ్రీ గరగరాజు మస్టారు గారిచే నడపబడును.

ఓంకా రోచ్చారణ చేసేటప్పుడు ఆత్మ ధ్యానం చెయ్యి. ఓంకార సంస్మరణ చేసేటప్పుడు నీస్వస్వరూపాను సంధానం చెచ్చి. ఓంకార సంకీర్తన చేసేటప్పుడు సర్వాంతర్గతమై భాసిస్తున్న సత్యమై "నేను" నేవేఅని హృత్పూర్వకంగా సంభావించు. ఇట్టి గాఢ ధ్యానంచేత మనస్సు పరమసత్యంలో ఐక్యమవుతుంది. ఇట్టీ గాఢ భక్తిచేత – జనీవ జ్ఞానంచేత – మనస్సనే బుడగ పగిలి పరమ సత్యమనే సాగరంలో ఏకమవుతుంది. ఇదేసాక్షాత్కారపథం. యీ గాఢజ్ఞాననిష్ఠ – ఈ సజీవ జ్ఞానం – ఈ మిధ్యాహంకార నిగ్రహతే – పరమ సత్యప్రాప్తికి మార్గం! విముక్తిపథం !

**స్వామి శ్రీరామతీర్థ**

# శాశ్వత అన్నదానం

1. శ్రీ వెంకట అప్పారావు అరిగెల గారు (పుట్టపర్తి) 50,040/-
డా॥ శ్రీ మాయీ డాటర్ ఆఫ్ చోడగం శ్రీనివాస రావు గారి జ్ఞాపకార్థం
మరియు శ్రీ సాయి మహేష్ రామన్ గారు
సన్ఆఫ్ అరిగెల వెంకట అప్పారావు గారి జ్ఞాపకార్థం
2. శ్రీ బాలేపల్లి రాంప్రసాద్ గారు (తుని) 8000/-
వీరి తల్లిగారు శ్రీమతి రమాదేవి గారి జ్ఞాపకార్థం
3. శ్రీ కొల్లి రామకృష్ణ గారు, శ్రీమతి హైమావతి గారు 5000/-
వీరి పెండ్లిరోజు సందర్భముగా
4. శ్రీమతి జి.బి.ఎస్. లక్ష్మి గారు (విశాఖపట్నం) 10,000/-
వీరి భర్త గారు శ్రీ గరిగిపాటి నర్సింహమూర్తి గారి జ్ఞాపకార్థం
5. శ్రీ కోలమూరి శివకృష్ణగారు (కాకినాడ) 5001/-
వీరి కుమారుడు చి॥ రియాన్ష్ పుట్టినరోజు సందర్భముగా
6. శ్రీ ఎమ్.వి.ఎన్. తేజోవన్తకుమార్ గారు శ్రీమతి ప్రశాంతి గారు 10,000/-
(హైదరాబాద్) వీరి అత్తగారు శ్రీమతి పాలపర్తి శారద గారి జ్ఞాపకార్థం
7. శ్రీ సానిపిని వీర్రాజు గారు శ్రీమతి వీరాయమ్మ గారు (వేట్లపాలెం) 5000/-
వీరి తల్లి గారు కీ॥శే॥ శ్రీమతి వీరరాఘవమ్మ గారి జ్ఞాపకార్థం

## విరాళములు

1. శ్రీమతి బి. వసంత గారు (ఢిల్లీ) 13,260/-
సోలార్ సిస్టం మరియు అగ్రికల్చర్ నిమిత్తం
2. డా॥ కృష్ణరాం భరతుల గారు (ఢిల్లీ) సోలార్ సిస్టం నిమిత్తం 2,74,109/-
3. శ్రీ గాలి నారాయణ రావు గారు (హైదరాబాదు) 10,000/-
గోగ్రాసం నిమిత్తం
4. శ్రీమతి దాసరి శేషారత్నం గారు (శాంతి ఆశ్రమం) 10,000/-
స్వామీజీ పుట్టిన రోజు సందర్భముగా అన్నదానం - వస్త్రదానం
5. శ్రీమతి గరిమెళ్ళ రేణుక శ్రీనివాస్ గారు 4,400/-
పూజలు, పండుగలు నిమిత్తం
6. శ్రీ ఐ. కేశవరావు గారు (హైదరాబాద్) 5000/-
స్వామీజీ పుట్టినరోజు సందర్భముగా అన్నదానం - వస్త్రదానం
7. శ్రీ గైనీడి శ్రీనివాస్ గారు (హైదరాబాద్) 1,00,000/-
విద్యాఖర్చుల నిమిత్తం

8. శ్రీ వానపల్లి ప్రణీత్ తేజ గారు (తిమ్మాపురం) 5000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా గోగ్రాసం నిమిత్తం

9. శ్రీ మట్టా వీరవెంకట సత్యనారాయణ గారు 50,000/-
శ్రీమతి దుర్గాదేవి గారు (కాకినాడ) బిల్డింగ్ రిపేరు నిమిత్తం

10. శ్రీ సంఘమిత్ర ఫౌండేషన్ (కాకినాడ) 8400/-

11. శ్రీ జె. సుధాకర్ రావు గారు (హైదరాబాద్) 10,000/-
వీరి తండ్రిగారు జె. శంకరరావు గారి జ్ఞాపకార్ధం

12. శ్రీ పి. హరి కుమార్ శర్మ గారు (శాంతి ఆశ్రమం) 3000/-
వీరి ధర్మపత్ని శ్రీమతి శారద గారి జ్ఞాపకార్ధం

13. శ్రీ గట్టి శ్రీరామకృష్ణగారు (హైదరాబాద్) 10,116/-
గోశాల నిర్మాణము నిమిత్తం

14. శ్రీమతి డి.ఎస్. లలిత కుమారి గారు (శాంతి ఆశ్రమం) 5000/-
స్వామీజీ పుట్టినరోజు సందర్భముగా వస్త్రదానం - అన్నదానం

15. శ్రీమతి ఆర్. వసుమతి నాయుడు గారు (పూనె) 3000/-
స్వామీజీ పుట్టినరోజు సందర్భముగా వస్త్రదానం - అన్నదానం

16. శ్రీ పుప్పాల సుబ్బలక్ష్మి గారు (పెద్దాపురం) 3000/-
సంక్రాంతి పండుగ సందర్భముగా

17. శ్రీమతి కొండూరి సీతారామమ్మ గారు (రాజమండ్రి) 4000/-

18. శ్రీమతి బండెల సరోజనీ దేవి గారు (శాంతి ఆశ్రమం) 15,000/-
వీరి మనుమరాలు మరియు శ్రీ కుంచే సురేంద్ర గారి భార్య
శ్రీమతి శ్వేత గారి సంస్మరణ దినము సందర్భముగా

పవిత్రమగు ఓంకారమును అనేక విధముల నుచ్చరించవచ్చునని చెప్పబడియున్నది. కాని యీవిధములగు పద్ధతులలో నుచ్చరించుటకు గాత్రమొకటియే సాధనము. కాని మౌనము నవలంబించి వివిధములగు మాటలను మాటలాడుట మాని కంఠ శబ్దమునే వుపయోగించుట విడిచి పెట్టిన మునులమాట యేమి? అట్టి యభివృద్ధి చెందినవారికంటే '<u>ఓం</u>' కారమును జపించుటకు మంచి మార్గమున్నది. అదిమానసికముగానే పెదవులను కదలింపకయే మౌనముగా జపించుట. పైకి వినిపించని ఆ ఓంకార నినాదము అరికాళ్ళ నుండి శిరోపరి భాగమువరకు ప్రసరించవలెను. అపుడు ఆ పవిత్ర స్పందనలు శరీరములోని అణవులలో కూడ గోచరించును. ఆ సాధనలో <u>కుండలిని</u> సహజమార్గమున మేల్కోనును. అపుడు అతడు సహస్రారములో కేంద్రీకృతనుగు కోటి సూర్యుల తేజముతో నింపబడును. అవిచ్ఛిన్నమగు తేజము యొక్క అనిర్వాచ్యమగు స్థితికి సహస్రారమున్నతమైన కేంద్రము.

**స్వామి ఓంకార్**

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......... Rs. 10/-
3. Soham .......... Rs. 10/-
4. Cosmic Fast .......... Rs. 20/-
5. Meditation .......... Rs.10/-
6. Om Japa .......... Rs.10/-
7. Control of Mind .......... Rs.30/-
8. Cosmic Flashes .......... Rs.10/-
9. In the Hours of Silence .......... Rs.10/-
10. The Soul of Omkar .......... Rs.10/-
11. How I learned English .......... Rs.10/-
12. Reincarnation of my Little Sister .......... Rs.10/-
13. God Realization Now and Here .......... Rs.10/-
14. Mystic Prayers and Poems .......... Rs.20/-
15. The Divine Voice of Omkar .......... Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) .......... Rs.100/-
17. Petals of Peace .......... Rs.20/-
18. The Story of my life and Work .......... Rs.10/-
19. Priceless legacy of Swami Omkar .......... Rs.10/-
20. The Four Initiations .......... Rs.10/-
21. Musings .......... Rs.20/-
22. Peace Prayer .......... Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org

Printed Book

To

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.